# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక10

పేజీలు 40

జూన్ 2016

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


ఈ సంచికలో ............................ ....... పేజీ


భద్రవాక్యం ....................2

శ్రీబాబూజీ ఉవాచ....................3

అమ్మమాట....................6

దేహత్రయము... ....................8

యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ........10

శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు..12

కృష్ణాపుష్కర కార్యక్రమములు ....................14

గురుప్రకాశం....................15

వాత్సల్యం ....................17

యోగవాశిష్ఠము ....................18

చావులేని చదువు ....................20

ఘనవాసన ....................21

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................22

పరిప్రశ్న ....................23

సౌందర్యము....................25

సద్గురుమూర్తికి నేనేమిస్తా ....................27

శ్రీకృష్ణకర్ణామృతము....................28

సద్గురుడవైవచ్చిన గురుతరభాగ్యమా!29

గీతాధ్యయనమ్ ....................31

అత్రిమహర్షి ....................33

పనికిరాని సాధనం ....................35

పాపానికి మూలం ....................36

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర......37

విష్ణు కథలు- సూరదాస్ ....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

పూషన్నే! కర్షే! యమ! సూర్య!
ప్రాజాపత్య! వ్యూహరశ్మిన్ సమూహ
తేజో యత్తే రూపం కళ్యాణతమమ్
తత్తే పశ్యామి యోసావసౌ ఉ పురుషస్సోహమస్మి ॥

(ఈశావాస్యోపనిషత్ శో॥ 16)

ఇద్దరు చెవిటివాళ్ళు కలుసుకున్నారు. 'మార్కెట్‌కు పోతున్నావా సుబ్బయ్యా?' అని అడిగాడు ఒక చెవిటివాడు. 'లేదు పాపయ్యా! మార్కెట్‌కు పోదామని బయలుదేరాను' అన్నాడు ఇంకో చెవిటివాడు. 'ఓహో! అలాగా మార్కెట్‌కుపోతున్నావేమో! అనుకున్నానులే' అన్నాడు మొదటి చెవిటివాడు.

ఇద్దరిమాట ఒకటే. కాని ఇద్దరిమధ్య అవగాహన లేకపోవటానికి కారణం వారిద్దరు చెవిటివాళ్ళే కాబట్టి. అలాగే సృష్టి అంతా ఈశావాస్యమే అయినా మానవుడు సృష్టిలోని విషయాదులకు ఆకర్షింపబడి మోహితుడై దాని ద్వారా శాశ్వతానందాన్ని పొందాలని చేసే ప్రయత్నంలో విఫలుడై అనేక సమస్యలకు లోనై దుఃఖానికి గురియై అశాంతిని పొందక తప్పటం లేదు. సృష్టి యావత్తు భగవంతుని రూపమే అయినా అవగాహన లేక భగవంతుని కోసం వెతుకులాడుతున్నాడు.

ఇంతవరకు ఎన్నెన్నో జన్మలెత్తి ఉపాధులుమారి పొందిన బాధలతో చివరికి శుభేచ్ఛ కలిగి నా దేహాత్మ భావనే దుఃఖానికి కారణమని గుర్తించి జగత్తు యొక్క ధ్యేయం ఏమిటో అదే నా ధ్యేయమని అదే ఈశ్వర తత్త్వమని మనస్సు హెచ్చరిస్తోంది. ఈశ్వరతత్త్వమే నీ స్వరూపము. సోఽహమస్మి అని హెచ్చరిస్తోంది. అదే ఘర్షణలేని, బంధనలేని, బాధలేని శాంతి ధామం. అదే 'నేను' మంగళకరమైన యదార్థమైన అభేదమైన ఆనంద స్థితి అని మనస్సు హెచ్చరిస్తోంది.

సూర్యకాంతిలో ఎన్నో శుభప్రదమైన పనులు చేసుకోవచ్చు. లేక దుష్కృతకర్మలు చేయవచ్చు. ఈశ్వర తత్త్వముతో కూడిన జగత్తులో భాగమైన జీవుడు జగత్తులో ఎలా వ్యవహరించాలి అనేదే మనస్సు హెచ్చరిక! మనస్సు శుభేచ్ఛ దిశగా మరల్చి జన్మని సార్థకం చేసుకోమని మనస్సే హెచ్చరిస్తోంది.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

ఇరువురు భక్తులు తమ కుటుంబ వ్యవహారాల ప్రస్తావన తీసుకువచ్చి శ్రీ బాబూజీ మహరాజ్‌కు వివరించి తమకు ఏదో కీడు జరగబోతోందని విన్నవించిన సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీ బాబూజీ మహరాజ్ బోధ చేస్తూ "ఎవ్వరినీ ఏమీ అనవద్దు, దూషించవద్దు. దూషణ భూషణలు కర్మబంధనకి దారితీస్తాయి సుమా! ఏది ఎలా జరగవల్సి ఉందో విధి నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. మానవుడు ఎన్ని ప్రగల్భాలు పలికినా విధి నిర్ణయానికి దాసుడే. విధి నిర్ణయాన్ని బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సహితం ఆపలేరు. జరగవలసినది నిర్ణయం ప్రకారం జరుగుతుంది. జరగకూడనిది ఎంత ప్రయత్నం చేసినా జరగదు. అలాగని పురుష ప్రయత్నం మానకూడదు. మనము నిర్వహించవలసిన కర్మ చేయవల్సిందే. కానీ ఫలితం మాత్రం ఆశించకూడదు. అది భగవంతుని నిర్ణయానికి వదిలిపెట్టాలి.



పూర్వజన్మ సంస్కారం చేత కొంతమంది ఆగర్భ శ్రీమంతులుగా జన్మించవచ్చు ధనధాన్యాలతో ఆనంద జీవితం గడపవచ్చు. సంస్కార హీనత చేత కొంతమందికి దారిద్ర్యం తప్పదు. గృహస్థుగా ఉన్న ప్రతివాడూ ఈ ఇల్లునాది అనుకుంటాడు. అంతకన్నా ప్రమాదమైనది 'ఈ దేహము నాది' అనే భావన. ఇటువంటి భావన ఎలా ఉంటుందంటే గుప్పిటి మూస్తే ఏదో ఉంది అనుకుంటారు. తీరా తెరిస్తే ఏమీ ఉండదు. భగవానుడు మానవుడిని సృష్టించి కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే అంతరింద్రియాలు అన్నిటినీ ఇచ్చి నీ స్థితి ఏమిటో తెలుసుకుని ఆనందించమంటే చక్షువుల ద్వారా చూసి మోహపడతాడు. ముక్కుద్వారా వాసన చూసి అసహ్యపడతాడు. నోటి ద్వారా రుచి చూసి ఇంకా ఏదో ఆనందాన్ని పొందాలని కోరుకుంటాడు.

దీనికంతకూ ముఖ్యమైన మనస్సులో సంకల్పము అనేది జనించి కర్మబంధనకి లోనవుతాడు. దానిద్వారా జన్మ సంక్రమించక తప్పదు కదా! సంకల్పమే జనించకపోతే జన్మరాహిత్యం తథ్యం. సంకల్పము question. జన్మ అనేది answer. No question No answer Understand?

విధి నిర్ణయము అంటే దైవ నిర్ణయం అన్నమాట. నీ జీవన విధానము ఎలా జరగవల్సి ఉందో నిష్పక్షపాతముగా ముందే నిర్ణయింపబడి ఉంటుంది. అది నీ జన్మ పరంపరలలో ఆచరించిన కర్మని అనుసరించి ఉంటుంది. అంతేగానీ దైవం బలవంతంగా నీపైన ఏ రకమైన జీవన క్రమాన్ని నిర్ణయించడు. దానిని తప్పించగల సమర్థత ఒక్క గురుదేవునికి మాత్రమే ఉంది. మానవుడు తాను ఆచరించిన సత్కర్మల ద్వారా ఉత్తమ గతిని లేక పుణ్యలోకాలు పొందుతున్నాడు. దుష్కృత కర్మల ద్వారా నరక ప్రాప్తి కలుగుతోంది. నీకు మానవ జన్మని ప్రసాదించి దేహమును, ఇంద్రియాలను కూడా ప్రసాదించి ఆత్మవస్తువుని ఆశ్రయించి ఆనందాన్ని పొందమంటే దానిని విస్మరించి దుర్గంధముతో కూడిన బురదగుంటను ఆశ్రయించి దుర్గంధము ఎందుకు వస్తోంది? అని ప్రశ్నిస్తే తప్పు ఎవరిది? అయినా సద్గురుమూర్తి అనుక్షణం నీవెంట ఉండి ఈ విషయాన్ని బోధరూపంలో హెచ్చరిక చేస్తున్నా ఆ హెచ్చరికను విస్మరించే మానవుని సంస్కారహీనత ఏ జన్మని సంప్రాప్తింపజేస్తుందో ఎవరు చెప్పగలుగుతారు? ఎన్నో జన్మలనుండి ఆర్జించిన కర్మవాసన రహితమయ్యే మార్గం లేదా? గీతాచార్యుడు సెలవిచ్చినట్లు 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం' అన్నట్లుగా ఎటువంటి కర్మనైనా జ్ఞానము దగ్ధము చేయ గల్గుతుంది. కానీ మీ హృదయబాబు 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణం' అంటున్నాడు.

సమర్థుడైన సద్గురు మూర్తిని ఆశ్రయించి ఆయన ప్రసాదించిన లక్ష్యార్థముపై మనసు నిలిపి ధ్యానం చేయటం ద్వారా ఉద్భవించిన ధ్యానాగ్ని ఎటువంటి కర్మనైనా దగ్ధం చేయగల్గుతుంది. ఇది మాత్రం సత్యం. ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. రావణాసురుడు మహాపండితుడు. అన్ని విద్యలలోనూ ఆరితేలినవాడు. భక్తుడు. శివుని

మెప్పించి వరాలు పొందాడు. బ్రహ్మను మెప్పించి వరాలు పొందాడు. సకల శాస్త్రపారంగతుడు. నమకం, చమకం రచించినవాడు. మహాతపస్వి. అట్టివాడు కామ ప్రలోభియై సీతను అపహరించి వివాహమాడ తలచాడు. రావణాసురుని భార్య మండోదరి మంచి భక్తురాలు, జ్ఞాని, శీలవతి. ఒక పర్యాయము తన భర్తతో సంభాషణ చేస్తూ 'స్వామీ! మీరు అన్ని మాయలను జయించినవారు కదా! సకల శక్తి సంపన్నులు కదా! మరి సీతను వరించడానికి రాముని వేషధారియై ఎందుకు వెళ్ళకూడదు?' అని సందేహము వెలిబుచ్చింది. రావణాసురుడు దానికి సమాధానం చెబుతూ 'శ్రీరామచంద్రుడు గుణరహితుడు. నిరాకారుడు. నిర్వికల్పుడు సాక్షాత్తు శ్రీ మన్నారాయణుడే సగుణ బ్రహ్మయై అవతరించాడు. అట్టి గుణరహితుని రూపాన్ని ధరిస్తే కామక్రోధాదిగుణాలు ఎక్కడ ఉంటాయి? అందుచేత శ్రీరామచంద్రుని వేషాన్ని ధరించి సీతను పొందటం సాధ్యం కాదు. ఆ సుందరరూపం ధరించినపుడు ప్రేమే కానీ వికారం ఉండదు' అన్నాడు. మండోదరి ప్రశ్నిస్తూ స్వామీ 'ఇంతటి జ్ఞానియైన మీకు ఎందుకు ఈ కామవికారం కలిగింది?' అని అడిగింది. రావణాసురుడు సమాధానం చెబుతూ 'అది విధివ్రాత దానిని ఎవరూ తప్పించలేరు' అంటాడు.

చూశారా! విధి నిర్ణయం ఎంత గొప్పదో! రావణుని జీర్ణాశయంలో అమృతభాండం ఉంది. అనేక వరాలను పొందాడు రావణుని సంహరించడం అసంభవం. అందువలననే శ్రీ మన్నారాయణుని లీల మాయరూపంలో అతనిని ఆవరించి కామప్రలోభాన్ని కలిగించింది. అది కేవలం రావణునికి ముక్తిని ప్రసాదించడానికే. ఈ విషయం రావణునికి తెలుసు. సీతాన్వేషణ చేస్తూ హనుమంతుడు రావణాసురుని దర్శించి ఆశ్చర్యపోతాడు. అతనిలోని దివ్యతేజస్సుని చూసి ఇది నారాయణ తేజస్సుకాదు కదా! అనుకుంటాడు. ఇంతటి తేజోస్వరూపుడా ఈ నీచకార్యానికి దిగింది. అని ఆశ్చర్యపోతాడు విధి నిర్ణయాన్ని ఎంతటివారైన అనుసరించక తప్పదు" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## నిర్మల హృదయ విరాజిత చరణం

"కాలం వేగంగా పరుగెడుతోంది అంటాము. ఇంతకీ కాలం పరుగెడుతోందా? మనం పరుగెడుతున్నామా? అంటే, మన మనస్సు అంత వేగంగా పరుగెడుతోందన్నమాట. అందుకేనేమో మానవులు ఎన్ని రకాల పనులైనా, ఎంత శ్రమ అయినా ఓర్చుకుని, చేయడానికి సంసిద్ధులు అవుతారు కాని, ఒక చోట స్థిరంగా కూర్చుని ధ్యానం చేయమంటే 'మా మనస్సు నిలవటం లేదండీ' అంటారు.



ఈ పూజాదికాలు, యాత్రలు మొదలైనవి చేయటానికి శారీరక శ్రమ, ఆర్థిక స్తోమత వుండాలి. ఒకవేళ అవన్నీ వున్నప్పటికీ, మనస్సు లేకపోతే అవి ఎన్ని చేసినా వృథాయే! కొంతమంది మిగతావాళ్ళు చేస్తున్నారు కాబట్టి తాము కూడా చేయాలనుకుంటారు. మరి కొంతమంది అలా చేయకపోతే తమ స్టేటస్‌కి భంగం అనుకుంటారు. కానీ, మహాత్ములు ఎప్పుడూ ఇటువంటి వాటికి లొంగలేదు. వారికి కావలసినదల్లా నిర్మల మైన అంతఃకరణ. అందుకనే వారికి ఎవరైనా నమస్కరించినప్పుడు 'నిర్మలాంతఃకరణ సిద్ధిరస్తు' అని ఆశీర్వదిస్తారు. నిర్మలమైన అంతఃకరణ మనకి శాంతిని ప్రసాదిస్తుంది. అందుకనే - నిర్మల హృదయ విరాజిత చరణం. సకల చరాచర వ్యాపక చరణం. భవసాగర ఉద్ధారక చరణం. శ్రీ గురుచరణం ప్రణమామ్యహమ్ - అని మనం సంకీర్తన చేస్తున్నాము.

నిర్మల హృదయంలో వున్నది వున్నట్లుగా దర్శనమవుతుంది. భగవత్ వస్తువు ప్రతి హృదయంలో నిలిచి వుంటుంది కాబట్టి, నిర్మల మైన హృదయంలో అది ప్రతిబింబించి, ఆత్మ దర్శనం అవుతుంది. అది ఎవరికి వారికే అనుభవైకవేద్యం. ఒక్కసారి లోపలికి చూడండి. లోపలికి చూడండి అంటే మీ లోపల కొట్టుకుంటున్న మాంసపు ముద్దను చూడటం కాదు. అది కేవలం మన ప్రాణం నిలబెట్టటం కోసం, కండలు,

రక్తం, నరాలతో భగవంతుడు నిర్మించిన ఒక పరికరం మాత్రమే. కానీ మన హృదయంలో విరాజిల్లుతున్నది ఒక అనంతమైన, అవ్యక్తమైన శక్తి. ఆ అవ్యక్తశక్తి ఒక రూపాన్ని ధరించి, గురురూపంలో వచ్చి, చెప్పకపోతే మనకు ఏమీ తెలియదు.

అది సర్వవ్యాపకమైనది. దానిని గుర్తించాలంటే, ఈ దేహంలో ప్రాణం ఉండేలోపలే గుర్తించాలి. అది సకల చరాచర వ్యాపక చరణం. దానిని గుర్తిస్తే మనం చిరంజీవత్వాన్ని పొందుతాం. షడ్భావ వికారాలతో కూడిన శరీరం ఏదో ఒక రోజు పడిపోవలసినదే. 'జాతస్య హి ధృవో మృత్యుః । ధృవం జన్మ మృతస్య చ।' అలాగన్నారని భయపడనవసరం లేదు. మామూలుగానే మనకేమైనా భయంకరమైన వ్యాధి సంక్రమిస్తే, డాక్టర్లు 'ఏమీ ఫర్వలేదు. అది మీకున్నదని మరచిపోయి మీరు హాయిగా వుండండి' అంటారు. అట్టి సలహా మనకేనాడో ఇచ్చి ఉన్నారు మన మహాత్ములు.

మనస్సుని నిరంతరం సత్సంగంలో ఊరవేసి ఉంచితే, అది సాధ్య పడుతుంది. ధ్యానం చేసుకోవటానికి నిర్మలమైన అంతఃకరణ అత్యంత అవసరం. సద్వస్తు విచారణ యందు అనురక్తి వుండాలి. త్యాగబుద్ధి కావాలి. విషయాదులను, విషయ ప్రపంచాన్ని త్యాగం చేస్తే కాని, మహాత్ముల సన్నిధికి రాలేము. ధ్యానం చేయలేము. కనుక సకల చరాచర వ్యాపకమైన ఆ చరణం దర్శించటానికి వైరాగ్యము, వివేక దృష్టి, సజ్జన సాంగత్యము కావాలి. మనస్సును అందులో ఊరవేయాలి. బజారులు వెమ్మట తిరిగితే డబ్బులు ఖర్చు అయి, ఖాళీ పర్సులు మిగులుతాయి. కానీ సత్సంగానికి వస్తే, జ్ఞానధనాన్ని కూడబెట్టుకోవచ్చు.

నీవు మహాత్ముల బోధను వినటం లేదు, చదవటం లేదు. వారి ప్రవచనాల గురించి ఆలోచించటం లేదు. నీ జీవితం యొక్క పరమార్థాన్ని గురించి గుర్తించటం లేదు. తద్వారా అశాంతిపాలై పోతున్నారు మానవులు. 'మనస్సు అశాంతిగా ఉంది' అంటారు. ఎక్కడి నుంచి వచ్చింది ఆ అశాంతి? అది నీ మనసు నుండే వస్తోంది. మహాత్ములు చెప్పిన వాక్కులను వింటూ నిరంతరం వాటియందే రమిస్తూ వుంటే, ఇక అశాంతికి తావెక్కడిది?

- సశేషం

# దేహత్రయము

- పరాశర ప్రసాద్

తన స్వస్వరూపాన్ని గుర్తెరగటమే మానవ జీవిత లక్ష్యమని తెలియబరచే వేదాంత ఆధారాలను గురించి తెలుసుకోవటం ప్రతి సాధకుని కర్తవ్యం. కంటికి గోచరించే ప్రపంచం అవాస్తవమని, అధ్యాస అనే మాయలో పడి నీ నిజ స్థితిని గుర్తెరగలేక పోతున్నావని సద్గురు దేవులు హెచ్చరిస్తూ ఉండేవారు.

జీవుడు దేహత్రయమనే ఆచ్ఛాదన కల్గియున్న విషయాన్ని ముందుగా గుర్తించి, తాను దేహత్రయానికి అతీతమని కేవలం సాక్షిమాత్రమేనన్న విషయం గుర్తించాలి.

ప్రతి జీవుడు స్థూల శరీరం, సూక్ష్మ లేక లింగ శరీరం, కారణ శరీరం అనే మూడు దేహాలు కల్గి వుంటాడని శాస్త్రం తెలియజేస్తోంది. స్థూలదేహం పంచభూతాత్మకమైన పృథ్వి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాలు మరియు సప్తధాతువులైన రసం, రక్తం, మాసం,. మేధస్సు, అస్థికలు, మజ్జ, శుక్లములతో మేళవించి వుంటుంది.

అంతేకాదు స్థితి, జన్మ, పెరుగుదల, మార్పు, క్షీణత, మరణం అనే షడ్భావ వికారాలు కలిగి వుంటుంది. దేహం, కర్మ, రాగం, ద్వేషం, అహంకారం, అవివేకం లేక అజ్ఞానం, మరియు లోకానుభవం అనే ఏడు ముడులతో బంధింపబడి వుంటుంది.

వాస్తవ, అవాస్తవాల మధ్య వ్యత్యాసం తెలుసుకోలేకపోవటమే అవివేకం. అవివేకం చేతనే రాగద్వేషాలు, అహంకారం జనిస్తాయి. దేహానికి కర్మ కారణం. దేహమే సుఖదుఃఖాలకు మూలం.

స్థూలదేహం పరిణామం చెందుతూ క్షీణిస్తుంది కాబట్టి శరీరమని, నీవు మరణించిన తరువాత దహనం చేస్తారు కాబట్టి అది దేహమని పిలువబడుతోంది.

సూక్ష్మ శరీరం పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే పందొమ్మిది (19) తత్త్వాలతో ఏర్పడింది.

విదేహముక్తిలో సూక్ష్మశరీరం చైతన్యంలో లయమై తన ఉనికిని కోల్పోతుంది. సుఖదుఃఖాల అనుభవానికి ఆధారం.

కారణ శరీరం అనిర్వచనీయమైన అవిద్య లేక అజ్ఞానము. ఇది స్థూల సూక్ష్మ శరీరాలకు ఆధారం. కారణ శరీరాన్ని వాసన అని కూడా చెప్పుకోవచ్చు. పంచతన్మాత్రలకు ప్రతీక. జీవుడిలో కారణ శరీరం ఈశ్వరుని కారణ శరీరం ఒక్కటే. జీవునిలో అది అవిద్య అయితే, ఈశ్వరుని విశ్వరూపంలో అది మాయ.

దేహ జ్ఞానానికి అతీతంగా ఎదగటానికి, నీ నిజస్థితిని గ్రహించ డానికి, జీవితాకర్షణలకు, సుఖదుఃఖాలకు బందీ కాకుండా ప్రభావితం కాకుండా వుండటానికి దేహత్రయ అధ్యయనం తోడ్పడుతుంది. అంతేకాదు స్థూల శరీరమూ అది చెందే మార్పులు, పుట్టటం, పెరగటం, రోగాలతో పీడింపబడటం లాంటి అనుభవాలు; స్థూలదేహాన్ని ఆశ్రయించుకుని ఉన్న ఇంద్రియాలు వాటి కోరికలు జగద్వాసన రూపంగా అనుభవిస్తూ ఉన్న సూక్ష్మ శరీరం అనుభవాలు; వీటన్నిటికి కారణమైన కారణ దేహము జీవుడు చర్విత చరణంగా సంసారంలో సంచరించటానికి తోడ్పడుతున్నాయని దేహత్రయ అధ్యయనం వలన తెలుస్తుంది.

---

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జూన్ 2016, జులై 2016 ల లో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

జూన్ 2016 : AS 4750, 6395, 6143, 6398, 7129, 7131, 7132.

జులై 2016 : AS 011G, 012G, 013G, 3728, 4767, 4769, 5195, 5916,
AS 5930, 6154, 6405, 6413, 6670.

– మేనేజర్

# యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ

- రమణ ప్రసాద్

శ్రీమాతాజీ తమ దర్శనార్థం వచ్చిన యువతరంవారితో "మీరందరూ ఒక్కొక్క వివేకానందుడిగా తయారవ్వాలి. శ్రీగురుదేవులు మనకు అందించిన ఆధ్యాత్మిక సంపదలకు మనమందరం వారసులం. శ్రీ బాబూజీ మహరాజ్ వారు ప్రబోధించిన విశ్వమతాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేయవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది.



ఒక శిష్యుడు : మీ ఆజ్ఞను శిరసావహిస్తాం. ఎలా ముందుకు సాగాలో తెలియజేస్తే, ఆ విధంగా ముందడుగు వేస్తాం.

శ్రీమాతాజీ : మీరందరూ గురువాణి చదివి ఉన్నారు కదా. అందులో ఏదో ఒక విషయాన్ని తీసికొని అందులోని సారాన్ని బాగా ఆకళింపు చేసికొండి. మీరు మాట్లాడటం మొదలుపెట్టేముందు శ్రీగురుదేవులను ప్రార్థించుకోండి. మాట్లాడే శక్తి వారే ఇస్తారు. ముందుగా "గురుబ్రహ్మ గురరుర్విష్ణుః..." అనే శ్లోకం చదివి," శ్రీ సర్వాధిష్ఠాన చైతన్య సమర్థ సద్గురు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారి పాదపద్మములకు సాష్టాంగ ప్రణామాలు చేస్తూ; (పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి చరణ కమలములకు నమస్కరిస్తూ): మీ అందరిలో ప్రకాశిస్తున్న గురుదేవులకు నమస్కరిస్తూ ..... శ్రీగురుదేవుల ఆదేశానుసారం మీముందు మాట్లాడటానికి సాహసిస్తున్నాను. నేను చెప్పినదానిలో ఏవైనా పొరపాట్లు దొర్లితే, మనస్ఫూర్తిగా నన్ను క్షమించి అందులో ఉన్న మంచిని తీసికొండి" అని చెప్పి మీ ప్రసంగాన్ని ప్రారంభించండి.

రెండవ శిష్యుడు : అమ్మా! మాకు శ్రీ గురుదేవులతో ఉన్న అనుభవాలను చెప్పవచ్చా?

మాతాజీ : తప్పకుండా చెప్పు. కాని ఆ అనుభవాలు ఆధ్యాత్మిక పరంగా ఉండాలి.

మూడవ శిష్యుడు : మాకు ఆధ్యాత్మిక విషయాలపై అంత అవగాహన లేదు. ముందుగా కొంత శాస్త్రాధ్యయనం చేసి.....................

మాతాజీ: మీరందరూ శ్రీగురుదేవుల ఉపన్యాసాలు విన్నవారే కదా! వారేమైనా క్లిష్టమైన తత్త్వాన్ని మనకు బోధించారా?
నాల్గవ శిష్యుడు : లేదు. వారి బోధలు పామరులనుకూడా ఆకట్టుకొనేటట్లు ఉండేవి. అందరి మనస్సులకు హత్తుకొనేవి. వారు చెప్పిన కథలు మనోరంజకంగా ఉండటమే కాక, లోతుగా ఆలోచించేటట్లుగా చేసేవి.
మాతాజీ: బాగుంది. ఐతే గురువాణిలో మొట్టమొదటిగా వచ్చిన బోధ "శ్రవణము". మీరు దాన్ని చదివారు కదా! అందులో ఉన్న సారాంశాన్ని ఒక్కొక్కరూ చెప్పండి చూద్దాం.
మొదటి శిష్యుడు : అందులో బాబూజీ వారు చెప్పిన కథ నాకు బాగా గుర్తు ఉంది. ఒక మహారాజు వద్దకు ఒక భయంకరమైన రాక్షసుడు గర్జిస్తూ మూడు పుర్రెలతో వస్తాడు. ఆ పుర్రెల వృత్తాంతం తెలియజేయమని అంటాడు, అలా చేయకపోతే అందరినీ చంపేస్తానని అంటాడు. ఆ రాజ్యంలోని మంత్రి మేథావి. మంత్రి ఒక సన్నని ఊచను తెప్పించి ఒక పుర్రె చెవిలో గుచ్చుతాడు. అది రెండవ చెవిలోనుంచి బయటకు వస్తుంది. వాడు అధముడు అనీ; అలాగే రెండవపుర్రెలో ఆ ఊచ నోటిలోనించి వస్తే అతడు మధ్యముడనీ; మూడవ పుర్రెలో ఆ ఊచ హృదయంలో నుండి వస్తే అతడు ఉత్తముడనీ నిర్ణయిస్తాడు. రాక్షసుడు తన ఓటమిని ఒప్పుకొంటాడు. ఇది కథలోని సారాంశం.
మాతాజీ : కథ బాగానే చెప్పావు. రాక్షసుడు ఎందువల్ల తన ఓటమిని ఒప్పుకొన్నాడు?
మొదటి శిష్యుడు చెప్పలేకపోయాడు. రెండవ శిష్యుడు కలగజేసుకొని ఇలా అన్నాడు : ఒక చెవిలోనుంచి వెళ్ళిన ఊచ రెండవ చెవినుండి బయటకు వచ్చివాడిని అధముడుగా మంత్రి పరిగణించాడు. అంటే అతడు శ్రవణం అంటే ఏమిటో తెలియనివాడు. అంటే అతడు తాను విన్న సద్విషయాన్ని ఈ చెవితో విని ఆ చెవితో వదివేస్తాడు అన్నమాట. రెండవ పుర్రెకు ఒక చెవిలో దూర్చిన ఊచ నోటిలోనుంచి బయటకు వచ్చింది. అంటే అతడు తను విన్న విషయాన్ని మననం చేసికోవటానికి ప్రయత్నిస్తాడు. కాబట్టి అతడు మధ్యముడు అని నిర్ణయించాడు. మూడవ పుర్రెలో గుచ్చిన ఊచ నేరుగా హృదయంలో గుచ్చుకొంది. అతడు తను విన్న విషయాన్ని చక్కగా హృదయంలో భద్రపరచుకొన్న ఉత్తముడు. భగవద్విషయాన్ని చక్కగా మననం చేసికొన్నవాడు. -సశేషం



## శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్
## కీర్తనలు
### శ్రీరామలింగేశ్వర సుప్రభాతము

1. శ్రీమన్! సర్వజగన్నాధ! ప్రాతస్సంధ్యా ప్రవర్తతే ।
రామలింగేశ్వర స్వామిన్ ఉతిష్ఠ పరమేశ్వర॥

2. ఉత్తిష్ఠోత్తిష్ఠ గౌరీశ! ఉత్తిష్ఠ ఫణిభూషణ।
ఉత్తిష్ఠ వృషభారూఢ! లోక కళ్యాణ సిద్ధయే ॥

3. శ్రీ మాతరంబ జగదీశ్వరి! భద్రమూర్తే ।
శ్రీ కాళికే! గిరిసుతే! శివపార్శ్వవర్తే ।
శ్రీశారదేంద్ర దయితాస్తుత భవ్య కీర్తే ।
శ్రీ చక్రరాజ నిలయే తవ సుప్రభాతమ్॥

4. తవ సుప్రభాతమరుణే ! హరప్రియే!
భవతు ప్రసన్న జన రక్షణోద్యతే।
పరమ ప్రసన్న సుమనోహరాకృతే।
పరిపాలయాఖిల జనానరిందమే॥

5. కాళీవనాంతర నివాస విలాసలోల।
కాళీ మనోహర। వరాభయ దానశీల।
బాలేందు శేఖర గళస్థ విషాగ్ని కీల।
శ్రీరామలింగ గురవే తవ సుప్రభాతమ్।

6. నాగాజినాంబర దిగంబర సంగదూర।
నాగేంద్రహార నటరాజ సతార్తిహార ।
యోగీశ్వరేశ్వర మహేశ్వర నిర్వికార ।
శ్రీరామలింగ విభవే తవ సుప్రభాతమ్॥

7. గంగా తరంగ కమనీయ జటాకలాప ।
భృంగీశ్వర ప్రముఖ సేవిత దివ్యరూప।
లింగాకృతే గిరి సుతా హృదయ ప్రదీప ।
శ్రీరామలింగ గురవే తవ సుప్రభాతమ్॥

6. కేదరనాథ భవ భూత గణాధినాథ।
వేదాంతవేద్య విదళీకృత పాపయూథ ।
ఆద్యంతహీన విశదీకృత తత్త్వ బోధ।
శ్రీరామలింగ గురవే తవ సుప్రభాతమ్ ।

7. శంభోశివ ప్రమధ వందిత శూలపాణే ।
అంభోరుహాసన హరీంద్ర సమర్చితాంఘ్రే।
గంభీర విగ్రహ భయాపహ చంద్రమౌళే।
శ్రీరామలింగ విభవే తవ సుప్రభాతమ్ ॥

8. మృత్యుంజయాంకిత మృకండు సుతాంతరంగ।
నిత్యాభిషేకరత భస్మ విలేపితాంగ ।
కాత్యాయనీ హృదయ కంజ విహార భృంగ।
శ్రీరామలింగ విభవే తవ సుప్రభాతమ్ ॥

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

జూన్ 2016

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

29 బుధ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

జూలై 2016

15 శుక్ర : తొలి ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, సాయంత్రం 5-30ని॥సత్సంగం, శ్రీ సద్గురుపాద పూజ, సత్సంగం, భక్త సమారాధన.

29 శుక్ర : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# కృష్ణా పుష్కర కార్యక్రమములు

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు
ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణాపుష్కర మహాయాగము

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి దివ్య ఆశీశ్సులతో, గుంటూరు జిల్లా, అమరావతిలో, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణములో (శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి ఆలయము ఎదుట రథము షెడ్ ప్రక్కన) నిర్వహించుటకు నిర్ణయించటమైనది. ఓం సమర్థ సద్గురు వాసవి అమరేశ్వర కృష్ణా పుష్కర మహాయాగము, అన్నదాన సహిత సత్సంగ సమావేశములు, అఖండ హరినామ సంకీర్తన, సామూహిక పూజలు, మరియు ఉచిత వైద్య శిబిరము నిర్వహింప బడును. భక్త మహాశయులందరూ అన్ని కార్యక్రమములలో పాల్గొని యీ సదవకాశమును వినియోగించ కొనగలరని, శ్రీ అమర లింగేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల దర్శనం చేసుకుని వారి కృపను, శ్రీ సద్గురుదేవుల అనుగ్రహమును పొందగలరని ఆశిస్తున్నాము.

12-8-2016 శుక్రవారం నుండి 24-8-2016 బుధవారం వరకు ఆశ్రమ ప్రధానకేంద్రమునకు విచ్చేయు పుష్కర యాత్రికులకు ఉచిత వసతి, మహాప్రసాదము ఏర్పాటు చేయబడినవి.

కార్యక్రమ వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. -
0863-2293564, 2293109 ; సెల్ నెం. - 94404 00100,
90303 81999, 93976 01237, 93465 35357, 83330 67877

**కాళీ వనాశ్రమము పావులూరి శాఖలో మాతాజీవారి సత్సంగ సమావేశాలు**

పావులూరు శాఖలో శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారి 41వ పుణ్యారాధన మహోత్సవములు, సత్సంగసమావేశములు, అఖండ హరినామ సంకీర్తన

2-6-16 నుండి 7-6-16 వరకు ప్రతిరోజూ పూజ్యశ్రీ మాతాజీ బోధ; రామానుజదాస్‌వారి ప్రవచనం ఉంటాయి.

వివరాలకు - శ్రీరామంగారు 94405 25600

# గురు ప్రకాశము

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

గురువంటే ఎవరు? మన సనాతన ధర్మములో గురువే సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమని చెప్పబడింది. గురుగీతలో గురువెవరో వివరిస్తూ

"గుశబ్దో అంధకారస్తు రుశబ్ధస్తన్నిరోధకృత్

అంధకార నిరోధత్వాత్ గురురిత్యభిధీయతే" - అనగా 'గు' అంటే అంధకారమని, 'రు' అంటే దానిని తొలగించువారనీ, గురువు అంటే అజ్ఞానమనే చీకట్లను పారద్రోలేవారనీ బోధిస్తోంది. చీకట్లను తొలగించేది ప్రకాశమే కాబట్టి గురువంటే ప్రకాశమని చెప్పకనే చెప్పినట్లయింది.

అలాగే సాధన మార్గంలో ఉన్న మనందరికీ ఎప్పుడో ఒకసారైనా మొలకెత్తే ప్రశ్న 'భగవానుడు ఎవరు?' ఆయన స్వరూపమేది? మన వేదాలూ, శాస్త్రాలూ భగవంతుడిని గురించి తెలియజేస్తూ 'భ' అంటే ప్రకాశరూపమని నిర్వచిస్తున్నాయి. మంత్రపుష్పం కూడా అదే విషయాన్ని తెలియజేస్తోంది...

"నీలతోయద మధ్యస్థాత్ విద్యుల్లేఖేవ భాస్వరా

నీవార సూకవత్తన్వి పీతాభాస్వత్యణూపమా"

అని. సర్వత్రా వున్న భగవానుడు మెరుపుతీగలలో వున్న కాంతిలోనూ, విత్తనము నుండీ మొలకెత్తుతున్న మొక్క చివరి భాగంలో బంగారు వర్ణంలో తళుక్కుమనే మెరుపులో కూడా కనిపించేది భగవంతుడి ప్రతిరూపమే అని తెలియజేస్తోంది. అంటే భగవానుడు సాక్షాత్తూ ప్రకాశరూపమనే చెప్పబడింది.

అయితే నాకు వచ్చిన సందేహమల్లా, గురువూ ప్రకాశమే, భగవంతుడూ ప్రకాశమే అయినప్పుడు ఒక ప్రకాశము మరియొక ప్రకాశాన్ని ఎలా చూపగలుగుతుంది? ఇదెలా సాధ్యమన్న ప్రశ్నతలెత్తగానే శ్రీబాబు దాని సమాధానం స్ఫురింపచేశారు. మామూలుగా ఒక ప్రకాశము మరియొక ప్రకాశములో లీనమయిపోతుంది. ఉదాహరణకి చిన్నతనంలో చీకట్లో టార్చిలైట్‌తో వెళ్తున్నప్పుడు వీధిదీపాల (స్ట్రీట్ లైట్) దగ్గరకి రాగానే టార్చిలైట్ కాంతి కనిపించేది కాదు. టార్చిలైటు ప్రకాశము

వీధిదీపం ప్రకాశం కంటె తక్కువ కాబట్టి దానిలో లయించిపోతుంది. మళ్ళీ వీధి దీపానికి దూరంగా నడిచి వెళ్ళినప్పుడే ఆ టార్చ్‌లైట్ ప్రకాశం కనిపిస్తుంది. తన వెలుతురులో వీధిదీపం వెలుతురుని చూపించాలంటే టార్చిలైట్ ప్రకాశం వీధిదీపం కంటే కాంతివంతమై ఉండాలి. ఆ సిద్ధాంతం ప్రకారం గురువూ, భగవంతుడూ ఇద్దరూ ప్రకాశస్వరూపమే అయినప్పుడు భగవంతుని గురుతుని ఎరిగించగలిగిన గురుప్రకాశము భగవానుని ప్రకాశం కంటె ఎక్కువే అయి ఉండాలి కదా!

మరి భగవానుని ప్రకాశము ఎంతో అంచనా వేయతగినదా? ఉపనిషత్తులు భగవానుని ప్రకాశం గురించి వివరిస్తూ ....

'నతత్ర సూర్యోభాతి న చంద్ర తారకం

నేమా విద్యుతో భాంతి కుతోయమగ్ని" అని తెలియజేస్తున్నాయి. దీని తాత్పర్యం ఏమిటంటే, భగవంతుడి సమీపంలో సూర్యచంద్రాదులు, నక్షత్రాలూ వెలగవట. అయితే నిజానికి అవి వెలగవని కాదు. భగవానుని ప్రకాశము ముందు వాటి వెలుతురు వెలాతెలా పోతుంది. ఇందాక వుదహరించినట్లుగా టార్చిలైట్ కాంతి వీధిదీపము ముందు వెలాతెలా పోయినట్లుగా. మరి భగవంతుడి ప్రకాశము అంత అయి వుంటే, భగవంతుడిని తన వెలుతురులో దర్శింపచేయగలిగిన గురుప్రకాశము ఇంకా ఎన్ని రెట్లు ఎక్కువ అయి ఉండాలి?

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి గంటల తరబడి వేచివుండి గర్భగుడిలో ప్రవేశించినప్పుడు ఏ ఆధారంతో ఆయన దర్శనం చేసుకోగల్గుతున్నాము. ఆయన మూర్తిపై తన ప్రకాశాన్ని ప్రసరింప జేస్తున్న ఒక దీపపు కాంతిలో కాదా? అలాగే భగవంతుడి సమీపానికి మన చేయి పట్టుకుని నడిపించి, తన వెలుతురులో ఆ పరంజ్యోతి స్వరూపాన్ని చూపించే కరుణామూర్తి గురుదేవులు. అదే కదా - భగవానుని ప్రకాశాన్ని తనలో లయం చేసుకుని, మనలోనే భగవంతుడు దాగివున్నాడన్న సత్యాన్ని ఎరిగింపజేసే అఖండకోటి సూర్యుల గురుప్రకాశము!!

# వాత్సల్యం

- పాలూరి కాళీప్రసాద్ U.S.A



ఆవు దూడని 'వత్సం' అంటారు. సాధారణంగా ఆవు తాజాగా వుండే పచ్చగడ్డినే తింటుంది కానీ, కనీసం ఎవరైనా తొక్కిన గడ్డిని కూడా తినటానికి యిష్టపడదు. మరి అదే ఆవు తనకు బిడ్డ పుట్టగానే, ఆ బిడ్డ శరీరాన్నంతా నాకి, ఆ మావిని, రక్తాన్ని శుభ్రంగా తొలగించివేస్తుంది. అలాగే తన బిడ్డకు ఎటువంటి గాయమైనా నాలుకతో నాకి శుభ్రం చేసి, స్వస్థత కలిగిస్తుంది. అందుకే నిష్కల్మషమైన, నిస్వార్థమైన ఆ తల్లి ప్రేమను 'వాత్సల్యం' అంటారు.

అలాగే మహాత్ములు, గురువులు, బ్రహ్మజ్ఞానులు సదా ఆత్మానంద సుఖాన్ని అనుభవించటానికి ఇష్టపడతారు కానీ, తుచ్ఛమైన ప్రాపంచిక విషయాలమీద ఎంతమాత్రం ఆసక్తి చూపరు. కానీ, తమ పుత్ర సమానులైన ప్రజలు మాయలో పడి నానా రకాల కష్టాలు అనుభవించడాన్ని చూసినప్పుడు మాత్రం వారి హృదయం వాత్సల్యంతో ద్రవిస్తుంది. కేవలం నిర్హేతుకమైన, నిస్వార్థమైన ఆ వాత్సల్యం కారణంగానే వారు తమ స్వస్వరూప ఆనంద స్థితి నుండి క్రిందకు దిగివచ్చి, జీవకోటిని ఉద్ధరించటానికి ఇంతగా పాటుపడుతున్నారు. ఏమిచ్చి మనం మరి వారి ఋణం తీర్చుకోగలం??

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

## భాసుడు, విలాసుల కథ

వశిష్ఠ మహర్షి రామచంద్రునితో యిలా అన్నాడు, "ధీశాలియైన ఓ రామా! ఎవరైతే నిరంతరము ధ్యాన సాధనతో ఆత్మానందముతో వోలలాడే వారికి బాధలు, కష్టాలు, దుఃఖము విషాదమనేది తెలియదు.



జీవాత్మ వొక ఎద్దులాంటిది, ఆ ఎద్దు సంసారమనే దట్టమైన అరణ్యములో వొక లక్ష్యమంటూ లేకుండా, విచ్చల విడిగా సంచరిస్తుంది, కోరికలనే బలమైన తాళ్ళతో మానవుడు బంధింప బడ్డాడు, కామమనే బెత్తంతో, అతను బాగా దెబ్బలు తింటాడు, వ్యాధులనే కీటకాలు కుడ్తుంటే యెంతో బాధపడతాడు, సంసారిక బాధలనే పెనుభారంతో మూలుగుతుంటాడు, నిరంతర కదలిక వలన, అతని శరీరానికి గాయాలు తగలటంచేత వెనకకు, ముందుకు వూగుతుంటాడు, అసంఖ్యాకమైన జన్మలనే వూబిలో, తన అజ్ఞానము వలన కూరుకుపోయాడు."

"ఆధ్యాత్మిక సాధకుడు తన మనసును నిర్మూలం చేసి, తన అతీంద్రియ శక్తితో పరమాత్మలో ఐక్యమౌతాడు, అప్పడీ అహంకారము, స్వార్థ పరత్వమునకు వీడ్కోలు చెప్పగలడు. అతనికి జ్ఞానులు లేక జీవన్ముక్తులతో, సర్వదా సాంగత్యముండాలి, తద్వారా ఆత్మ సాక్షాత్కారమును పొందే మార్గాన్ని కనుగొంటారు. స్వచ్ఛమై, చక్కని క్రమశిక్షణ పొందిన మనసు, ఆత్మ జ్ఞానమును పొందుటకు ఋజువైన మార్గము, మనసు ఆత్మలో లయించినట్లయితే అట్టి వ్యక్తి తురీయావస్థ ఎరుకలోవుంటాడు. ఎప్పడైతే వొక వ్యక్తి యిలాంటి అనుభవాన్ని సాధిస్తాడో, అన్ని వాసనలు, విషయాలు లేక వస్తువులు సంపూర్తిగా నశిస్తాయి. ఎప్పడైతే, ఆత్మ విచారణ ప్రారంభమౌతుందో అప్పడే మనస్సు క్రమేపి పవిత్రత యనే వుదాత్త

స్థితిని చేరుకొంటుంది. ఒక వ్యక్తి తన మనసులోని నీచస్థితిని అంటే అల్ప భావములను, మనసులోని వుదాత్త భావములతో నిర్మూలం చేయాలి, తద్వారా బ్రహ్మ జ్ఞానము లభిస్తుంది, అప్పడే భయంకర సంసారములోని బాధలన్నీ అంతమౌతాయి. ఎప్పడైతే మనసు నిర్మూలమై, పతనము చేసే అహంకారము నశిస్తుందో, అప్పడే, ఆత్మ జ్యోతి ప్రభవించి, నిత్యమైన ఆత్మానందము పొందుతాడు."

"ఓ రఘువీరా! పైన చెప్పిన అనుభవాలని చక్కగా వివరించటానికి భాసుడు, విలాసుడని యిద్దరు సోదరుల మధ్య జరిగిన సంభాషణలో యిమిడి వున్న ప్రబోధాన్ని నీకు కథా రూపంగా చెప్తాను".

"భాసుడు, విలాసుడని పిలువబడే యిద్దరు మునులు, సహ్యాపర్వతముపై నిర్మింపబడ్డ అత్రి మహర్షి కుటీరములో నివసించేవారు, వారిరువురూ, అత్రి మహర్షి పుత్రులు, పుష్పాన్నుండి దాని పరిమళాల్ని విడదీయ లేనట్లు, వారిరువురూ పరస్పర అనురాగముతో, యేక మనస్కులై జీవించేవారు. వారి దేహాలు వేరైనప్పటికి, యేకాత్ములై, యేక మనస్కులై వర్ధిల్లారు.

వారి అనుబంధమెంత గాఢంగా పెనవేసుకొందంటే, వారు వొకే కాండము నుండి వచ్చిన రెండు రెమ్మల్లా వున్నారు. కొంత కాలము గడిచిన తర్వాత, వృద్ధులైన వారి తల్లిదండ్రులు దివంగతులైనారు, సోదరులిద్దరూ, వారికంత్యక్రియలు చేశారు. తల్లిదండ్రుల నిష్క్రమణకు వారిరువూరూ యెంతో విషాదానికి లోనైనారు, కన్నీరు మున్నీరుగా విలపించారు, వారిరువురూ వొకరికొకరు వీడ్కోలు చెప్పకొని, వేరు, వేరు దిశలలో పయనించారు. వారి కాలాన్ని నిర్జనమైన అరణ్యములో, తీవ్రమైన తపస్సులో గడిపారు, వారిలోని కోరికలన్నీ నశించాయి, వారి శరీరాలు కృశించాయి, కాని వారు సత్యమైన జ్ఞానాన్ని పొందలేక పోయారు, తరువాత కొంత కాలానికి వారిరువురూ కలుసుకున్నారు.

- సశేషం

# చావులేని చదువు

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

చదివి చదివి చావంగనేటికి
చావులేని చదువు చదవవలయు
చదివి చదివి జనులు చచ్చిరి గదా
విశ్వదాభిరామ వినురవేమ!

- యోగి వేమన

సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఙ్కరణే

- ఆది శంకరాచార్య

మనం చదువుకునే ఈ ప్రాపంచిక చదువులన్నీ పొట్టకూటి కోసమో, లేక పేరు ప్రతిష్ఠలు సంపాదించటానికో మాత్రమే ఉపయోగ పడతాయి. చక్కగా చదువుకోవటం అవసరమే. కానీ చదువే జీవిత పరమార్థం కారాదు. ఏది ఎంతవరకో దాని పరిమితి తెలుసుకుని మసలుకోవాలి.

చిన్నప్పుడు చదువుకోవటం, వయస్సులో ఉండగా సంపాదించడం సహజమే. కానీ మానవులమై పుట్టినందుకు మన జీవిత పరమార్థం ఆత్మజ్ఞానాన్ని సంపాదించి జనన మరణ విషవలయం నుండి విముక్తులమవటం.

ప్రాపంచిక చదువులు ఆ విషయంలో ఏమీ ఉపయోగపడవు. దానికి ఆధ్యాత్మిక విద్య కావాలి. కాని కొందరు ఎంత వయస్సు వచ్చినా, చివరికి కాటికి కాలుజాపుకున్నా ఇంకా బిరుదుల కోసమో, పేరు చివర తోకల కోసమో అలా అంతులేకుండా చదువుతూనే ఉంటారు.

ఎంత చదివినా ఏదో ఒక రోజు అందరూ చావ వలసిందే. ఆ చావు నుంచి ఈ చదువులేవీ కాపాడలేవు. అందుకే ఇక ఈ వేలంవెర్రి వదిలించుకొని చావులేకుండా చేసే ఆధ్యాత్మిక విద్య నేర్వమని వేమన యోగి ; ఆది శంకరాచార్య స్వామి జనులను హెచ్చరిస్తున్నారు!!

# ఘనవాసన

(పరమార్థ కథల నుండి)

ఒక గజదొంగ ఒకనాడు ఒక పట్టణంలో అర్ధరాత్రి వేళలో ఒక ధనికుడి ఇంటిలో కన్నం వేస్తూ పట్టుబడ్డాడు. పోలీసులు పట్టి కేసువేసి కోర్టులో హాజరు పరచారు. విచారణ పూర్తి అయిన తరువాత అతను చేసిన నేరం ఋజువైనందున అతనికి 10సంవత్సరాలు కారాగార శిక్ష విధించారు. కొంతకాలానికి శిక్షాకాలం పూర్తి అయింది.

అతనిని విడుదల చేశారు. దొంగ జైలు నుండి బయటకు పోవుచుండగా, ఆ జైలు అధికారి అతని శిక్షకాలం పరిమితి అమలులో జరిగిన చిన్నపొరపాటు గమనించి, ఆ దొంగను వెనుకకు పిలిచి, "నాయనా! నీ శిక్షాకాలము రెండు రోజులు క్రిందటే ముగిసింది, కాని లెక్కలో పొరపాటుగా యీ రెండు రోజులు నిన్ను అధికంగా జైలులో వుంచటం జరిగింది. ఈ విషయంలో ఆందోళన చెందకు" అన్నాడు.

వెంటనే ఆ దొంగ ఆ జైలు అధికారితో, "అయ్యా! జరిగిన దానికి తమరేమీ కంగారు పడవద్దు. రాబోయే శిక్షలో నాకు ఆ రెండు రోజులు తగ్గిస్తే చాలు" అని చెప్పి వెళ్లిపోయాడు.

చూశారా! పది సంవత్సరాలు కారాగార శిక్ష అనుభవించినా కూడా ఆ దొంగ హృదయంలో మార్పు రాలేదు. మరొకసారి దొంగపనికి అతను అప్పుడే నాంది వేసుకున్నాడు. ఇదే 'ఘనవాసన!'

ఈ ప్రకారంగా మానవులు బహు జన్మార్జిత దుష్టవాసనలు కారణదేహమందు నిగూఢంగా దాగి, పలురకాలుగా వారి చరిత్రను మలినపరుస్తాయి. వాటిని జాగ్రత్తగా గమనించి, శుభసంస్కారముచే రూపుమాపి, హృదయాన్ని దోషరహితం చేస్తే కాని శాంతి లభించదు. వివేకాన్ని ఆశ్రయించి, ప్రయత్నపూర్వకంగా దుష్టవాసనలను చిత్తం నుండి తొలగించుకోవటమే మానవుని ఏకైక లక్ష్యం. అప్పుడు మాత్రమే జీవుడు పరమాత్మ సాక్షాత్కారాన్ని పొంది జన్మ సాఫల్యం పొందగలడు.

**నీతి - చెడ్డపనిని మరల మరల ఆచరిస్తే అది 'ఘనవాసన'గా మారుతుంది. కాబట్టి సత్కర్మల ద్వారా దానిని అరికట్టి, తొలగించుకుని, మంచి అలవాట్లనే కలిగియుండేలాగ అభ్యాసం చేయాలి.**

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

జూన్ 2016

05 ఆది : అమావాస్య.

13 సోమ : జేష్ఠ శుద్ధ నవమి - శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ వారి నవమ వార్షికారాధన

18 శని :  శని త్రయోదశి

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

జూలై 2016

02 శని : శని త్రయోదశి

03 ఆది : మాస శివరాత్రి , పావులూరు శాఖలో ఏకాహం

04 సోమ : అమావాస్య

15 శుక్ర: తొలి ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన

16 శని : దక్షిణాయన ప్రారంభం.

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన,చాతుర్మాస్య దీక్షా ప్రారంభం.

29 శుక్ర : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

31 ఆది : గోదావరి అంత్య పుష్కర ప్రారంభం

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

క్షణభంగురము, అశాశ్వతము అయిన మానవ జీవితం నుండి స్వేచ్ఛని ప్రసాదించటానికి 'విధివాక్యం' అనగా ఆచరించవలసినది, మరియు నిషేధవాక్యం అనగా త్యజించ వలసినది. వాటికి సంబంధించిన బోధని అందించిన పిమ్మట ఉన్నత సత్యాన్ని 'తత్త్వమసి' అన్న ఉపదేశ వాక్యం ద్వారా సద్గురుమూర్తి అపరోక్ష జ్ఞానాన్ని అందిస్తారు. మాయామోహితుడైన జీవుని మనస్సు శుద్ధి చెందవలెనంటె తప్పక విధి నిషేధాలు ఆచరించాలి. స్వచ్ఛమైన మనస్సు మాత్రమే అపరోక్ష జ్ఞానం గుర్తించగలుగుతుంది. సద్గురుమూర్తి శిష్యునికి 'నీవు అదే'- 'తత్త్వమసి' అని బోధిస్తాడు. శిష్యుడు శ్రవణం చేసి, దానిలోని భావాన్ని గురించి మననం చేస్తాడు. మననం నిదిధ్యాసల ద్వారా అనుభూతిని పొందుతాడు. తత్త్వమసి మహావాక్యంలో 'తత్' శబ్దం మాయలో ప్రతిబింబించే చైతన్యాన్ని, 'త్వమ్' శబ్దం అవిద్యలో ప్రతిబింబించే చైతన్యాన్ని సూచిస్తాయి. 'అసి' అన్నది వాటి ఐక్యతను సూచిస్తుంది. 'చిత్' అన్నది ఒక్కటే మాయ, అవిద్య, అనే ఉపాధులలో ప్రతిబింబించి ఈశ్వరుడు, జీవుడు అని గుర్తింపబడుతున్నాడు.



జీవుడు స్థూల సూక్ష్మ కారణ శరీరాలు అనబడే దేహత్రయము. జాగృత, స్వప్న, సుషుప్తావస్థలో పరిమిత జ్ఞానం. అనేకత్వం, అవిద్య వంటి ధర్మాలతో కూడి ఉండటం జీవధర్మం. అవిద్యలో ప్రతిబింబించే చిత్ జీవుడుగా వ్యవహరింపబడతాడు. వీటన్నిటికి ఆధారభూతమైనది కూటస్థుడు. అజ్ఞానానికి కారణమైన ప్రకృతి త్రిగుణాత్మకం. సచ్చిదానంద ప్రతిబింబం దానిలో ఇమిడి ఉంటుంది.

అవిద్యకున్న బహురూప లక్షణములే పరిచ్ఛిన్నత వలన జీవులు ఎన్నో విడువడి పంచకోశాలతో, దేహత్రయంతో కర్మబంధనకి గురికాక తప్పటం లేదు. పరిమిత ఉపాధులన్నిటికి ఆధారమైన శుద్ధ చైతన్యమే తత్ శబ్ధ లక్ష్యార్థము. జీవునికి సాక్షియై దేహత్రయం మొదలగు వాటికి

ఆధారమైన కూటస్థుడే త్వమ్ శబ్ద లక్ష్యార్థము.

ఘటములోని ఆకాశము ఘటాకాశము. అది మహాకాశానికి భిన్నంగా గోచరించటానికి కారణం ఘటము అనే ఉపాధి. జీవుని ఉపాధికి పరిమితమైనది జీవాత్మ. సర్వవ్యాపకమైనది పరమాత్మ. ఉపాధి తొలగితే జీవాత్మ పరమాత్మకు భిన్నము కాదుకదా! అపరోక్ష జ్ఞానమే కారణ అజ్ఞానం నుండి జీవునికి విముక్తి. అది కేవలం సద్గురుమూర్తి పరమానుగ్రహమే.

ముందుగా తత్ అనే పరమాత్మ వస్తువు ఎక్కడున్నదో అని దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు దర్శిస్తాడు. చివరికి తత్ అని తాను వెతికే వస్తువు సద్గురుమూర్తి ఉపదేశం ద్వారా తనలోనే ఉందని తెలుసుకుని సాధన ద్వారా దేహేంద్రియాలను, మనస్సును, బుద్ధిని దాటినప్పుడే ఆత్మ సాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. అదే తత్త్వమసి అన్న మహావాక్యం యొక్క అనుభూతి.

ఒక వ్యక్తి తన కుమారుడికి తండ్రిగా, తండ్రికి కుమారుడిగా బాంధవ్య దృష్టితో చూస్తే వేరుగా ఉన్నప్పటికి ఆ వ్యక్తి ఒక్కడే కదా! త్వం లక్ష్యార్థమైన కూటస్థుడికి తత్ లక్ష్యార్థమైన బ్రహ్మకు గల ఏకత్వము అటువంటిదే అని గుర్తించిన జ్ఞానికి పునర్జన్మ లేదు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

జూన్ 2016

20 సోమ : జేష్ఠ పౌర్ణమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

జూలై 2016

15 శుక్ర : తొలి ఏకాదశి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

19 మంగ : ఆషాఢ గురు పౌర్ణమి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

29 శుక్ర : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ.

# సౌందర్యము

-సేకరణ మురళీ

(వార్తాలాపము నుండి)

ఒక రాజకుమారుడు ఒకరోజు వేటకు వెళ్ళాడు. అక్కడ నది ఒడ్డున తన స్నేహితులతో కలసి వెడుతున్నాడు. అక్కడ ఒక వైశ్యపుత్రిక ఇరుప్రక్కల తెరవేసుకొని స్నానము చేస్తోంది. రాకుమారుడు అశ్వారూఢుడై వున్నందున తెరలో వున్న వైశ్యపుత్రికను పైనుండి చూశాడు. ఆమె సౌందర్యమును చూసి ముగ్ధుడై, వెంటనే సంతోషమును విడిచి శోక సముద్రమున మునిగిపోయాడు. వివరాలు తెలిసికోగా ఆమె తన నగరంలోని శ్రేష్ఠి కుమార్తె అని తెలిసి మరింత దుఃఖించ సాగాడు. నిద్రాహారాలు మానివేశాడు. శరీరం రోజురోజుకూ కృశించిపోసాగింది. కుమారుడి పరిస్థితి చూసి తండ్రి కంగారుపడి, అతని స్నేహితుల ద్వారా విషయాన్ని తెలుసుకున్నాడు. వెంటనే ఆ శ్రేష్ఠిని పిలిపించి, అతని కుమార్తెను తన కుమారుడికి ఇచ్చి వివాహం జరిపించమని ఆజ్ఞాపించాడు.

'తమరు క్షత్రియులు, మేము వైశ్యులము నా కుమార్తెను మీకు ఇవ్వటం ఎలా కుదురుతుంది?' అన్నాడు. అతడు ఎంత చెప్పినా రాజు అంగీకరించలేదు. ఏడు రోజులలోపు పెళ్ళి జరిపించనిచో బలవంతంగా పెళ్ళి చేయవలసి వస్తుందని రాజు బెదిరించాడు. శ్రేష్ఠి ఇంటికి వెళ్ళి ఎంతగానో దుఃఖించాడు. విషయం మాత్రం ఎవరికీ చెప్పలేదు. కుమార్తె వత్తిడి చేసి అడిగిన మీదట అసలు విషయం బయటపెట్టాడు. దానికి ఆమె నవ్వుతూ "దీనికి మీరు కంగారు పడవలసినదేమీ లేదు. వెళ్ళి రాజుగారితో వివాహానికి ఒక రోజు ముందు నేను వారి కుమారుని ఏకాంతంగా కలవాలనుకుంటున్నానని చెప్పి రండి" అన్నది. శ్రేష్ఠి వెళ్ళి రాజుగారికి యీ విషయం తెలియజేశాడు.

వైశ్యపుత్రిక ఒక వృద్ధ వైద్యుని పిలిపించి, 'ఏడు రోజులకు నాకు విరేచన ఔషధము కావాలి, శరీరం నుండి రక్తమాంసములు బయటకు పోవాలి, కేవలం ఎముకలు చర్మము మాత్రమే మిగలాలి' అన్నది. ఆమె ఔషధం తీసుకొనుటచే విసర్జించిన మల మూత్రాదులను వేరువేరు పాత్రలయందు నింపి వుంచినది. తన అభీష్ఠం ప్రకారం ఆమె చాల దుర్బలురాలు అయింది. ఎముకలు, చర్మం మాత్రమే కనిపిస్తోంది.

ఇక్కడ రాకుమారుడు ఆ వైశ్యపుత్రిక కోసం కలలు కంటున్నాడు. ఏడు రోజుల తరువాత ఆమె పల్లకీ ఎక్కి అందులో తన మలమూత్ర పాత్రలు మఖ్మల్ వస్త్రముతో కప్పి వాటిని కూడా తీసుకుని బయలు దేరింది. తాను నిర్దేశించిన ప్రదేశంలో రాకుమారుడికోసం ఎదురు చూస్తూ కూర్చుంది. రాకుమారుడు వచ్చి ఆమెను చూసి ఏ భూతమో, ప్రేతమో అనుకొని భయంతో హడలిపోయాడు.

ఆమె - అదేమిటి అలా భయపడుతున్నారు? నేను వైశ్యపుత్రికను నన్ను చూసి తాము ముగ్ధులయ్యారు కదా! నేనే ఆమెను.

రా.కు - ఆమె మహా సౌందర్యవతి. నీవు ఇంత భయంకరంగా వున్నావేమి?

ఆమె - నేనే ఆమెను. దగ్గరగా రండి. నేను నా సౌందర్యాన్ని తీసి ప్రక్కకు పెట్టాను. అందుకనే నా స్థితి యిలా వున్నది.

రా.కు - సౌందర్యాన్ని తీసి ప్రక్కకు పెట్టే పదార్థమా? బట్టలు, నగలు తీసి ప్రక్కకు పెట్టవచ్చుగాని, సౌందర్యాన్ని ఎలా తీస్తారు?

ఆమె - వస్త్రాన్ని తొలగించి చూస్తే నా సౌందర్యం కనిపిస్తుంది. అది మీ కోసం ఎదురు చూస్తోంది అని తీసి చూపగానే వచ్చే దుర్గంధం భరించ లేక రాకుమారుడు దూరంగా పారిపోసాగాడు.

ఆమె - అట్లా వెళ్ళిపోతున్నారేమిటి? అదే నా సౌందర్యం.

రా.కు - అదెలా?

ఆమె - అన్నపానాదుల వలన యీ శరీరములో రక్తమాంసాదులు ఉద్భవించి వానిచే శరీరం సుందరంగా కనిపిస్తుంది. ఏడురోజులకు పూర్వం ఇది నాశరీరంలో ఉండి, సౌందర్యాన్నిచ్చి, దాని యందు మోహాన్ని కలిగించింది. నేడు బయటకు వచ్చి, దుర్గంధ భూయిష్ఠంగా ఉంది. ఈ అస్థి మాంసం, క్రిమి, మల మూత్రాదులతో నిండిన శరీరంపై మోహాన్ని పొందటం మీ వంటి విజ్ఞులకు ఉచితం కాదు.

వైశ్యపుత్రిక చెప్పిన మాటలు విన్నంతనే రాకుమారుడికి స్త్రీ వ్యామోహం తొలగిపోయింది. విరక్తి జనించుట వల్ల తీవ్ర వైరాగ్యము కలిగి, ప్రపంచాన్ని త్యజించి, బ్రహ్మవిద్యాపేక్షతో అరణ్యానికి వెళ్ళిపోయాడు. ధర్మపరాయణుడైన సత్యగురుదేవుని ఆశ్రయించి, జ్ఞానాన్ని ఆర్జించి బ్రహ్మానందానుభవాన్ని పొందాడు!!

# సద్గురుమూర్తికి నే నేమిస్తూ?

- పెనుమాక నాగేశ్వరరావు

ఆశ్రితులకు ఆశ్రయమిస్తూ, ఆపన్నులకభయం ఇస్తూ
సర్వం మనకై చేస్తూ, సకలం తానై చూస్తూ,
అవ్యాజ ప్రేమను కురిపిస్తూ, భవబంధాలను వదిలిస్తూ,
భక్తిని గుర్తిస్తూ, శక్తిని అందిస్తూ, స్ఫూర్తిని కలిగిస్తూ,
చిన్మయంగా నవ్వేస్తూ, కోరికలన్నీ తీర్చేస్తూ,
తోడుగా నిలిచే సద్గురుమూర్తికి నే నేమిస్తూ?
బోధలు వినిపిస్తూ, బాధలు తొలగిస్తూ,
మనసును నిలిపేస్తూ, మలినం కడిగేస్తూ,
ఆశీస్సులు అందిస్తూ, శుభమస్తని దీవిస్తూ,
నిరతము కరుణిస్తూ, మహిమలు చూపిస్తూ
తోడుగా నిలిచే సద్గురుమూర్తికి నే నేమిస్తూ?
భక్తిగ చేతులు జోడిస్తూ అక్షర మాలను అర్పిస్తూ
సతతము గడిపెద ఆ నామము స్మరియిస్తూ
మీరే దిక్కని ప్రార్థిస్తూ, మీ దయ చాలని అర్థిస్తూ.



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

ద్వితీయాశ్వసము 43వ శ్లో॥ -

అగ్రే దీర్ఘతరోయ మర్జున తరుస్తస్యాగ్రతో వర్త్మనీ
సాఘోషం సముపైతి తత్పరి సరేదేశేకళిన్దాత్మజా
తస్యాస్తీర తమాల కానన తలే చక్రం గవాం చారయన్
గోపః క్రీడతి దర్శయిష్యతి సఖేపన్థాన మవ్యాహతమ్ ॥



తాత్పర్యము -

ఓ మిత్రమా! అదిగో! ముందుగా మిక్కిలి ఉన్నతుడు శోకమోహాలలో తరువులాగా స్తంభించి అర్జునుడున్నాడు. అతని ముందే గీతోపదేశమనే సుగమమైన మార్గమున్నది. ఆ మార్గము వుపనిషత్తులను గమ్యముగా కలిగి యున్నది. కానుగుచెట్ల చీకటివలె అజ్ఞానంధకారము ముసురుకుని యున్న హృదయ ప్రదేశములో యమునా నదివలె సాగే చైతన్య ప్రవాహమును గీతోపదేశము ద్వారా శ్రీకృష్ణుడు అధ్యయనం చేయిస్తున్నాడు. అదే కైవల్యాన్ని ప్రసాదించే ఏకైక మార్గము.



# సద్గురుడవై వచ్చిన గురుతర భాగ్యమా!

- సుశీలా ప్రసాద

పాలబువ్వ కూడా అరిగించుకోలేని అర్భకులకి 'లక్ష్యార్థాన్ని' అమృత గుళికలుగా గోరుముద్దలుగా చేసి, తినిపించి అనంతశక్తి సంపన్నులుగా చేసి, తన అద్వైత సామ్రాజ్య సంపదకి వారసులుగా చేసిన సమర్థసద్గురుదేవుల కరుణా విశేషాన్ని ఎంతని కొనియాడగలం?

శ్రీబాబు మాతో ఒకసారి (గుండుగొలను, పోతునూరు గ్రామాలకు వస్తున్నప్పటి సంగతి) 'ఏ గురువులూ, ఏ ఆశ్రమాలూ ఎరుగని మీరు సరాసరి నా దగ్గరికే వచ్చేశారు' అన్నారు. అప్పట్లో శ్రీబాబు దేవతార్చనను (అమ్మగదిలోని పూజా పీఠం) తెచ్చుకుని రెండు మూడు రోజులు, ఇంకా ఎక్కువ కాలం ఉండి పూజ చేసి తీర్థ ప్రసాదాలు ఇస్తుండే వారు. ఏ రాజమండ్రిలోనో, భీమవరంలోనో 'అమ్మ'ని (దేవతార్చనను) ఉంచేసి, తను వస్తే మాత్రం ఎక్కువరోజులు ఉండేవారు కాదు.

బాబు వచ్చారని తెలియాగనే మేము రకరకాల పూలతో దండలు కట్టి తీసుకువెళ్ళేవాళ్ళం అమ్మకి అలంకారం చేస్తారుకదా అని. ఒకసారి గుండుగొలను చిరంజీవిరాజుగారింటికి వచ్చారని తెలిసి, వెంటనే దండలతో బయలుదేరి వెళ్ళాము. బాబు కుర్చీలో కూర్చుని వున్నారు. అప్పుడు తెలిసింది దేవతార్చనను తీసుకురాలేదని. 'అమ్మని తీసుకు రాలేదా బాబూ?' దండ ఆయన చేతికి అందిస్తూ. "నేనేగా అమ్మని" అన్నారు శ్రీబాబు. అలా అంటూ ఆ దండని తమ మెడలో వేసుకుని ఒక్క క్షణం ఉంచుకుని తిరిగి తీసి ఇచ్చారు. తనే 'జగన్మాత' అని ఈ విధంగా తెలియజేశారు.

మా అత్తగారు (అమ్మమ్మగారు) పుట్టిల్లు గుండుగొలను గ్రామానికి దగ్గరైన ద్వారాకాతిరుమల. ద్వారకా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారు వారి తలిదండ్రులకి ఇలవేల్పు. ఏ శుభకార్యమైనా అక్కడే చేసుకునేవారు. అందువలన ఆవిడకి 'వెంకన్నబాబు' నామ స్మరణమే అలవాటయింది. అద్దె ఇళ్ళల్లో దేవుని పూజకి చోటు లేకపోతే నాలుగు ఇటుకలతో చిన్న అరుగులాగా కట్టుకొని దానిమీద వెంకన్నబాబు ఫొటో పెట్టుకుని రోజూ దీపం పెట్టుకునేది.

శ్రీబాబు దర్శనం అయిన తరువాత కూడా శ్రీ వెంకన్నబాబు స్మరణే ఆవిడకి.

ఒకసారి గుంటూరు గోపాల్‌గారింట్లో శ్రీబాబు ఉన్నప్పుడు ఆవిడ సరాసరి శ్రీబాబు దగ్గరకు వెళ్ళి శ్రీబాబును చూస్తూ 'నా వెంకన్న బాబు మీరేనా బాబూ!' అని అడిగింది. "అవునమ్మా! నేనే వెంకన్నబాబుని" అని నొక్కి చెప్పారు శ్రీబాబు. అప్పటి నుండి వెంకన్న వదిలేసి బాబూ! బాబూ! అని స్మరిస్తూ ఉండేది. ఆవిడ మనస్సులో సందేహాన్ని తీర్చి, తన ఇలవేల్పు 'బాబు'గా తిష్ఠ వేసుకుని ఆమెకు ముక్తిని ప్రసాదించారు సకల దేవతా స్వరూపుడైన శ్రీబాబు! మన హృదయ బాబు!!

# తోడేలు ఏకాదశి

ఒకనాడు ఒకతోడేలు ఆహారంకోసం గంగానది ఒడ్డున వెతుక్కుంటుంటే, దానికి తెలియకుండా వరద నీరు చుట్టుముట్టింది. తోడేలు ఒక ఎత్తైన రాతి మీదకు ఎక్కింది. అక్కడి నుండి ఎలా తప్పించు కోవాలో, ఆహారం ఎలా సంపాదించుకోవాలో దానికి తెలియలేదు.

"అన్నట్లు ఇవాళ ఏకాదశి కదా! ఉపవాసం ఉండిపోతాను. పుణ్యం సంపాదించుకుంటాను. ఆహారం లేకపోతే మానెలే!" అనుకున్నది తోడేలు మనస్సులో.

ఇంతలో ప్రవాహం వెంట ఈదుకుంటు వుస్తున్న మేక ఒకటి తోడేలును చూడక అది ఉన్న రాతి మీదకు ఎక్కి కూర్చున్నది.

దానిని చూడగానే తోడేలు "పుణ్యం కావాలంటే వచ్చే ఏకాదశి నాడు సంపాదించుకుంటానులే! ఇవ్వాళ్టికి ఇది దొరికింది. ఈ మేకను తింటాను" అనుకుంది మనస్సులో.

మేకను పట్టుకోవటానికి తోడేలు దానివెనుక పరుగెత్తింది. తోడేలును చూడగానే మేక ఒక్క దూకు దూకి ప్రవాహంలోకి ఈదుకుంటూ దూరంగా వెళ్ళిపోయింది.

"ఇంకా నయం! ఆ మేకను తినేశాను కాదు. ఉపవాసం భంగమై పుణ్యం కాస్తా పోయేది!" అనుకున్నది తోడేలు మనస్సులో.

(గత సంచిక తరువాయి)

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

## 15. పురుషోత్తమ ప్రాప్తియోగము

భగవానుడు, త్రిగుణముల గురించి వివరంగా తెలిపి, వాటిని దాటే ఉపాయము తెలిపి, అచంచల భక్తి ద్వారానే అది సాధ్యమని, అట్టి భక్తి ద్వారా మానవుడు మూడు గుణములను దాటి బ్రహ్మ సాక్షాత్కారం పొందగలడని తెలిపి, అట్టి భక్తి జీవులలో ఉద్భవించుటకు సహాయభూతంగా పురుషోత్త ముడగు పరమాత్మస్వరూపమును, దానిని పొందు మార్గమును, దానిని పొందినందువల్ల కలిగే ప్రయోజనం గురించి చెబుతున్నాడు.



భగవద్భక్తి పెంపొందాలంటే విషయ విరక్తి అత్యావశ్యకము. దృశ్యమాన రూప సంసారమును ఒక అశ్వత్థరూపంగా పోల్చి దానిని అసంగమనే ఖడ్గంతో ఛేదించవలెనని భగవానుడు చెప్పుచున్నాడు.

ఊర్ధ్వమూల మధఃశాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।
ఛన్దాంసి యస్య పర్ణాని యస్తం వేద సవేదవిత్ ॥ 1

"వేదములు ఆకులుగాను, రావిచెట్టు పైన వ్రేళ్ళు, క్రింద కొమ్మలు కలిగి ఉండే వృక్షం నాశం లేనిదని చెబుతారు. దానిని తెలిసినవాడే వేదార్థం ఎరిగినవాడు. ఈ సంసార వృక్షం కొమ్మలు గుణాల వలన పెంపొందుతూ, విషయ సుఖాలే చిగుళ్ళుగా విస్తరిస్తాయి. మానవులలో ధర్మాధర్మ కర్మ బంధాల వల్ల దాని వ్రేళ్ళు క్రిందికి కూడా వ్యాపిస్తాయి."

నరూప మస్యేహతథోప లభ్యతే నాన్తోన చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూలం అసఙ్గ శస్త్రేణ దృఢేన ఛిత్వా ॥ 3
తతఃపదం తత్పరిమార్గతవ్యం యస్మిన్గతా న నివర్తన్తి భూయః ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతఃప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥ 4

"ఈ సంసార వృక్షం యొక్క స్వరూపంగాని, ఆదిమధ్యాంతాలుగాని, ఈ లోకంలో ఎవరికీ తెలియవు.లోతుగా నాటుకొన్న వేళ్ళు గల అశ్వత్థ (సంసార)వృక్షాన్ని వైరాగ్యమనే ఖడ్గంతో ఖండించి, పునర్జన్మ లేకుండా చేసే పరమ పదాన్ని వెదకాలి. ఈ సంసారం విస్తరించటానికి కారకుడైన ఆది పురుషుడిని (పరమాత్మను) శరణు పొందాలి. అభిమానం అవివేకం లేకుండా పదార్థములందు సంగం అను దోషమును జయించినవారు

నిరంతరం ఆత్మజ్ఞానం కలవారును, కోరికలు లెస్సగా తొలగినవారు సుఖదుఃఖములనే ద్వంద్వముల నుండి విడువబడినవారును అగు జ్ఞానులు అట్టి అవ్యయమైన బ్రహ్మపదాన్ని (మోక్షాన్ని) పొందుతున్నారు. ఆ పరమపదాన్ని సూర్యచంద్రాదులు ప్రకాశింప జేయలేరు. దేనిని పొందితే తిరిగి సంసారానికి రానక్కర్లేదో అట్టి పరంధామం నాది. నాలోని శాశ్వతమైన అంశవే జీవాత్మగా పరిణమించి ప్రకృతిలోని జ్ఞానేంద్రియములను, మనస్సును ఆకర్షిస్తుంది."

"వాయువు పువ్వుల నుండి వాసనను తీసుకుని పోయినట్లుగా, జీవుడు శరీరాన్ని ధరించేటప్పుడూ, విడిచిపెట్టేటప్పుడు మనస్సును వెంట బెట్టుకుపోతాడు. ఈ జీవులు చెవి, కన్ను, చర్మం, నాలుక, ముక్కు, అనే అయిదు జ్ఞానేంద్రియాలను, మనస్సును ఆశ్రయించి, విషయాలను అనుభవిస్తాడు. సూర్యునిలో ఉన్న జగత్తును ప్రకాశింపజేసే తేజస్సు, చంద్రునిలోనూ, అగ్నిలోనూ ఉండే తేజస్సు నేనే అని తెలుసుకో. నేను భూమిలో ప్రవేశించి నా ప్రభావంతో సర్వభూతాలను ధరిస్తున్నాను. అమృతమయుడైన చంద్రునిగా సమస్త సస్యాలను పోషిస్తున్నాను. వైశ్వానరుడు అనే జఠరాగ్ని రూపంతో సకల ప్రాణుల శరీరాలలో ఉండి ప్రాణ అపాన వాయువులతో కలిసి, నాలుగు రకాల ఆహారాలను (భక్ష్య, భోజ్య, లేహ్య, శోష్యాలు) జీర్ణం చేస్తున్నాను."

"సర్వ ప్రాణుల హృదయాలలో ఉన్న నా వల్లనే జ్ఞానం, జ్ఞాపకం, మరుపు కలుగుతాయి. వేదాల వల్ల తెలుసుకొనవలసినవాడిని నేనే. వేదాల కర్తను, వేదాలను ఎరిగినవాడిని నేనే. ఈ లోకంలో క్షరులని, అక్షరులని ఇద్దరు పురుషులున్నారు. నశించే ప్రాణుల సముదాయాన్ని క్షరుడని, మార్పులేని జీవులను అక్షరుడని అంటారు."

ఉత్తమః పురుషస్త్వన్యః। పరమాత్మేత్యుదాహృతః।
యో లోకత్రయమావిశ్య। బిభర్త్యవ్యయ ఈశ్వరః॥ 17

"ఈ ఉభయులకంటె నాశనం లేని ఈశ్వరుడిగా మూడు లోకాలలోనూ వ్యాపించిన పరమాత్మ తాను. క్షరుడు, అక్షరుడు కంటే ఉత్తముడు కావటం వలన పురుషోత్తముడిగా ప్రసిద్ధి పొందాను. ఇలా నన్ను పురుషోత్తముడుగా తెలుసుకున్నవాడు సర్వజ్ఞుడై నన్నే ఆరాధిస్తాడు."

- సశేషం

(గత సంచిక తరువాయి) # అత్రి మహర్షి - రమణ ప్రసాద్

అత్రిమహర్షి అనసూయతో,"నేను తపస్సు చేయటానికి వెళ్ళాలనుకుంటున్నాను. నువ్వు నాతో వస్తావా? బిడ్డలతో వుంటావా?" అని అడిగాడు. అప్పుడు ఆమె," నాథా! ఇంకా పుత్రులు పెద్దవారు కాలేదు. కొంతకాలం ఆగండి. పుత్ర పోషణార్థమై పృథు చక్రవర్తి వద్దకు వెళ్ళి అవసరమైన ధనం తీసుకొని రండి" అని కోరింది. అత్రి, ధనార్థియై పృథువు వద్దకు వెళ్ళాడు. అప్పుడు పృథువు అశ్వమేధయాగము చేస్తున్నాడు. పృథువు అశ్వాన్ని విడిచి దాని సంరక్షణార్థం తన పుత్రుని పంపుతూ, అతనికి సహాయంగా అత్రిమహర్షిని వెళ్ళమని కోరాడు. ఇంద్రుడు




అశ్వాన్ని హరించుకు పోతుండగా, అత్రి ఆజ్ఞాపించగా, దేవేంద్రునిపైన పృథు పుత్రుడు బాణం వేశాడు. ఇంద్రుడు అశ్వాన్ని విడిచి పారిపోయాడు. అశ్వమేధ యాగం నిర్విఘ్నంగా పూర్తి అయింది. పృథువు అత్రిమహర్షికి దక్షిణలనిచ్చి తృప్తి పర్చాడు. అత్రిమహర్షి పృథువుని అనేక విధాలుగా కొనియాడాడు. గౌతమ మహర్షి'ఒక మానవమాత్రుడిని ఇంతగా పొగడటం సబబు కాదు' అని అత్రి మహర్షిని దూషించాడు. అత్రి మహర్షి నా వాక్యములలో దోషం లేదన్నాడు. వీరి వాదములను విన్న సనత్కుమారుడు " 'నావిష్ణుః పృథివీపతిః' కాబట్టి అత్రి పలుకులు ధర్మయుక్తములు" అని తెలుపగా పృథు చక్రవర్తి అత్రిమహర్షిని ధనకనకవస్తు వాహనాములనిచ్చి సత్కరించి పంపాడు. ఆ ధనాన్ని పుత్ర సంరక్షణకు వినియోగించి సతీ సమేతంగా తపస్సు చేయటానికి అడవికి వెళ్ళిపోయాడు.

ఒకప్పుడు దేవతలకు జంభాది దైత్యులకు జరిగిన యుద్ధంలో సూర్య చంద్రులు మూర్ఛనందగా లోకం అంధకార బంధుర మయింది. దేవతలు అత్రి మహర్షిని ఈ ఆపదనుండి రక్షించమని వేడగా తన తీక్ష్ణ దృష్టితో రాక్షసుల నాశనం చేశాడు. జగద్ధితార్థం అత్రి మహర్షి అనేక మహత్కార్యాలు చేశాడు.

అరణ్యవాసం చేస్తున్న సీతారామలక్ష్మణుల వద్దకి భరతుడు వచ్చి శ్రీరాముని పాదుకలు తీసికొని నంది గ్రామానికి వెళ్ళిన తరువాత, శ్రీరాముడు భార్యానుజులతో అత్రి మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రిమహర్షి వారిని ఎంతో గౌరవించాడు. అనసూయ సీతాదేవికి పతివ్రతా ధర్మములు తెలిపి నూతన వస్త్రములను , ఆభూషణములను ఇచ్చి ఆశీర్వదించింది. ఆ రాత్రి సీతారామ లక్ష్మణులు ఆశ్రమంలో గడిపి వెళ్ళిపోయారు.

ఒక సారి ఋషులందరు అత్రి మహర్షితో," మహాత్మా! నువ్వు విశ్వవిదుడవు. ఋషి శ్రేష్ఠుడవు. దైవములలో ఉత్తమ దైవం ఎవరు? ఏది పరమ ధర్మము? పరమేశ్వరుని అర్చించే విధానం ఏది?మాకు ఈ సంశయాల నివృత్తి చేయండి" అని ప్రార్థించారు.

అత్రి మహర్షి సంతసించి, "ఋషులారా! దేవతలలో శ్రీమన్నారాయాణుడే ఉత్తమ దైవం; ఉపవాస, స్వాధ్యాయాదులతో ఆయనను అర్చించటమే పరమ ధర్మం; ఇహాముత్ర సుఖములకాతని అర్చించవే అర్చనావిధానం. ఈ అర్చన రెండు విధాలు - అమూర్త్యార్చనము, సమూర్త్తార్చనము అని. అగ్న్యాహుతి అమూర్త్యార్చన అని, ప్రతిమార్చన సమూర్త్యార్చన అని తెలియండి"అని వుపదేశించాడు. కర్మ, ప్రతిష్ఠ, పూజన,స్వప్నోత్సవ ప్రాయశ్చిత్తము, అని విభజించి దేవతార్చన విధానాన్ని లోకానికి చాటి తన్మూలంగా లోకానికి తరుణోపాయంగా ప్రసాదించాడు. అదే అత్రి సంహితగా ప్రసిద్ధి పొందింది.

# పనికిరాని సాధనం

ఒక కుందేలు ఒక కొక్కిరాయి దగ్గరకు వచ్చి "నీవు కట్టుడు పళ్ళు బాగా కడతావట, నాకు రెండు మంచి దంతాలు కట్టు" అన్నది.

'నీ పళ్ళన్నీ బాగానే ఉన్నాయే!' అన్నది కొక్కిరాయి. "బాగా లేవని కాదు. నాకు ఇంకా పొడువైన కోరలు - సింహం లాంటి కోరలు కావాలి" అన్నది కుందేలు.

'దేనికి?' అని కొక్కిరాయి అడిగింది.

"నక్కను భయపెట్టడానికి. దానితో వేగలేకుండా ఉన్నాను. దాన్ని చూసినప్పుడల్లా పారిపోవలసి వస్తోంది. ఈ దెబ్బతో అదే నన్ను చూసి పారిపోవాలి" అన్నది కుందేలు.

కొక్కిరాయి తనలోతాను నవ్వుకుని, కుందేలుకు రెండు భయంకరమైన కోరలు అమర్చింది.

కుందేలు అద్దంలో తన ముఖం చూసుకుని "అద్భుతం! ఇప్పుడు చెబుతాను నక్కపని!" అనుకుంటూ నక్కను వెతుక్కుంటూ వెళ్ళింది. అది ఎంతో దూరం పోకుండానే పొదలచాటున పొంచి వున్న నక్కను చూసింది.

కుందేలు అదిరిపోయి, శరవేగంతో కొక్కిరాయి దగ్గరకు తిరిగి వచ్చి, "అన్నా! ఇవి తీసేసి, వీటికంటె భయంకరంగా వుండేవాటిని వేరే అమర్చగలవా?" అని అడిగింది.

'మార్చవలసినది నీ దంతాలు కాదు. నీ పిరికి గుండె. అది తీసి వేరే గుండె అమర్చినప్పుడు కానీ, నీ సమస్య తీరదు!' అన్నది కొక్కిరాయి.

# పాపానికి మూలం

- పరాశర ప్రసాద్

ఒక పండితుడికి ఒక అనుమానం వచ్చింది - 'పాపాలకు మూలం ఏది?' అని. ఎంత మందిని అడిగినా ఈ ప్రశ్నకు సమాధానం దొరకలేదు. అందుచేత ఆ పండితుడు కాశీకు ప్రయాణమై అక్కడి విద్వాంసులను అడిగి తెలుసుకుందామని అనుకున్నాడు.

దారిలో ఒక గ్రామం తగిలింది. ఊరి బయట దేవాలయం సమీపంలో ఒక గుడిసె కనిపించింది. ఆ గుడిసెవాణ్ణి పండితుడు పలకరించి, తాను కాశీకి ఎందుకు వెడుతున్నదీ చెప్పి, "ఇక్కడ నేను స్వయం పాకం చేసుకునేందుకు తగిన చోటు ఏమైనా వున్నదా?" అని అడిగాడు.

'మీరు ఈ గుడి ఆవరణలోనే స్వయంపాకం చేసుకోవాలి. మీరు కాసేపు ఈ మండపంలో కూర్చోండి. నేను ఇప్పుడే వచ్చి మీకు సహాయం చేస్తాను' అన్నాడు.

తరువాత కొద్దసేపటికి ఆ గుడిసెవాడు ఒక పళ్ళెంలో భోజనం తెచ్చి, 'స్వామీ! ఇది నా యింటి భోజనం. ఇది ఆరగించి నా వ్రతం పూర్తి చేయండి. ఈ వ్రతం పూర్తి చేయటానికి ఎన్నో ఏళ్ళుగా 108 బంగారు కాసులు పోగుచేశాను' అన్నాడు.

"నీ భోజనం తింటే నాకు పాపం చుట్టుకుంటుంది" అన్నాడు పండితుడు.

'ఈ భోజనం తింటే నా బంగారు కాసులన్నీ మీకు దానం చేస్తాను' అన్నాడు వాడు. వెంటనే పండితుడు భోజనం చేశాడు.

'స్వామీ! పాపానికి మూలం మీకు తెలిసింది గదా? ఆశ ! ఇక మీరు కాశీ వెళ్ళనక్కర్లేదు. ఇంటికి తిరిగి పొండి' అన్నాడు ఆ గుడిసెవాడు.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

పోతునూరు అక్కయ్య్య మనవరాలు జై కాళి అయిదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు మెదడు వాపు జబ్బు వచ్చింది. డాక్టరు "వ్యాధి ముదిరి పోయింది, బ్రతకదు" అని చెప్పాడు. "బ్రతకటం మాట ఎలా ఉన్నా , ఏ వైద్యమూ లేకుండ యింట్లో ఉంచుకోలేము గనుక ఏదో మీకు తోచిన వైద్యం చేయండి" అని పోతునూరు అక్కయ్య్య బ్రతిమాలితే ఏ ఆశా లేకపోయినా, వాళ్ళ తృప్తి కోసం ఆసుపత్రిలోనే ఒక గదిలో ఉంచి, ఏదో మందిచ్చి , సెలైను పెట్టి, మరునాటి దాకా రానని ఆ డాక్టరు వేరే ఊరికి వెళ్ళాడు. సాయంకాలం ఆ పిల్లకు తల పోటు



భరించరానిదై పోయింది. 'ఓం బాబు' అని కొంచెం సేపు అన్నాక యిక అనలేక పోయింది. సెలైను సీసా వంక చూస్తూ, నిలువు గుడ్లు పడిపోయాయి. శ్వాస ఆగిపోయింది. సెలైను ఎక్కటం కూడా ఆగిపోయింది. కాని డాక్టరుకు చెప్పేదాకా వెళ్ళటం యిష్టం లేక శ్రీ బాబును తలుచుకుంటూ ఆ రాత్రి అక్కడే ఉండిపోయారు పోతునూరు అక్కయ్య్య.

మర్నాడు ఉదయం డాక్టరుగారు వస్తూనే పిల్లను చూసి "ఎప్పుడో పోయింది. నేను చెబితే మీరు వినలేదు" అంటూ సెలైను పెట్టే సూదిని తీసేశాడు. అంతే! పాప నిద్ర లోచిన దానిలా చివుక్కున లేచి కూర్చుని "అమ్మమ్మా! ఆ (సెలైన్) సీసా వంక చూడు! బాబుగారు ఎలా కూర్చుని ఉన్నారో! నేను రాత్రి అంతా చూస్తూనే ఉన్నాను. ఆయన అలా కూర్చునే ఉన్నారు. నీకు కనబడటం లేదా?" అన్నది. కరుణా సముద్రుడైన శ్రీ బాబు అలా దర్శనమిస్తూ పిల్లకు ప్రాణం పోశారు గదా అని అక్కయ్య్యతో బాటు డాక్టరు , మిగతా జనమూ అంతా ఆశ్చర్యపోయారు.

కోటిపల్లి తాతయ్యగారి వియ్యంకుడూ వియ్యపురాలూ తాతయ్యగారిని చూసి పోదామని ఒకసారి కోటిపల్లి వచ్చినప్పుడు, వియ్యంకుడికి జ్వరం వచ్చి, ఎన్నాళ్ళకూ తగ్గలేదు. అప్పుడు మామ్మగారూ కుమార్తె వెంకట రమణమ్మగారూ ఆశ్రమంలో ఉన్నారు. వియ్యంకుడికి సుస్తీ అని తెలిసి, కోటిపల్లి వెడదామని ఎన్నిసార్లు శ్రీబాబు వద్ద శెలవు కోసం ప్రయత్నించినా, దొరకలేదు.

ఆయనకు బాగా వ్యాధి ముదిరిపోయి, క్రింద పడుకోబెట్టారు. అటూ యిటూ కాకుండా వారం రోజులుంచారు. ఎవరో అది చేతబడి అన్నారు. అటువంటి ప్రయోగాలను గూర్చి తెలిసిన వారిని విచారించగా, నాలుగు నెలల క్రితమే ఆయనపై ప్రయోగం జరిగిందని, ఒక వస్తువును పాతి పెట్టారని, అది కుళ్ళిపోక ముందు తగిన ప్రతి క్రియ జరిగితే ఆయన బ్రతికే అవకాశం ఉండేదని, రెండు నెలల క్రితమే అది కుళ్ళి పోయిందని, అయినా, యీ రెండు నెలలు యీయన బ్రతికి ఉండటము ఏదో బలీయమైన దైవ శక్తి వల్లనే అని, ఆ దైవ శక్తియే యీయనను బ్రతికించాలని అన్నారు. అప్పుడు పోతునూరు అక్కయ్య , శ్రీ బాబుకు మొక్కుకున్నారు. త్వరలోనే జబ్బు తగ్గిపోయింది.

అక్కడ ఆశ్రమంలో శ్రీ బాబు సత్సంగ సమావేశంలో మాట్లాడుతూ, మామ్మగారిని చూపించి “వీళ్ళ వియ్యంకుడికి ప్రాణం మీదకు వచ్చిందని, తాను వెళ్ళాలని, నేను శెలవు యివ్వలేదని కంగారు పడుతోంది. అక్కడ ఉన్నవాళ్ళు ఆయనకు ఏం చేయగలిగారు? ఈవిడ వెళ్ళి ఆయనకు ప్రాణం పోస్తుందా? ఇన్నాళ్ళూ యీమె యిక్కడ ఉండి తీర్థం తీపుకున్నది గనుక ఆ తీర్థ మహిమ వల్ల, జగన్మాత కృప వల్ల, ఆయన పునర్జన్మ పొందాడు. నేను మిమ్మిల్ని ‘ఇక్కడకు రండి, యిక్కడ ఉండండి’ అనటం మీ మేలు కోసమే గాని, మీరు ఉండటం వలన నాకు ఒరిగేది గాని, మీరు లేకపోతే నాకు తక్కువయ్యేది గాని ఏమీ లేదు” అన్నారు.

- సశేషం

-గత సంచిక తరువాయి **విష్ణు కథలు** - రమణ ప్రసాద్

# సూరదాస్

యశోద తనలో తాను ఇలా అనుకుంటోంది "ఎప్పుడు నా బుజ్జికన్న పాకటం మొదలుపెడతాడో? ఎప్పుడు లేచి నుంచుంటాడో? ఎప్పుడు మాట్లాడుతాడో? ఎప్పుడు నందుని 'బాబా' అని పిలుస్తాడో? ఎప్పుడు నన్ను "అమ్మా" 'అమ్మా'అని పిలుస్తూ నా వెంటపడతాడో? ఎప్పుడు నా చెంగుపట్టుకుని నన్ను విసిగిస్తూ నన్ను ఇల్లంతా తిప్పుతాడో? ఎప్పుడు వాడికి నా చేతితో కొంచెం కొంచెంగా తినిపించ గలుగుతానో? ఎప్పుడు వాడి మాటలు విని నాలో దుఃఖ భయాలు పోయి ఆనందం వెల్లివిరుస్తుందో? ఎప్పుడు నాకు తెలియకుండా నేను ఏదో పనిచేసుకొంటుంటే బయటకు పరిగెడతాడో? అంధకార బంధురమై ఆకాశం ఉరుములతో గర్జిస్తూంటే నా తండ్రి ఏమవుతాడో?"



సూరదాస్ "ఒకవైపు యశోద ఇలా ఆతురత పడుతూ ఉంటే వ్రజవాసులంతా కూడా కృష్ణుడికి ఏ ఆపద వాటిల్లుతుందో అని భయపడుతున్నారు" అని అంటాడు.

ఈ విధంగా భగవానుని లీలా మాధుర్యాన్ని వివరిస్తూ గానం చేస్తున్న సూరదాస్ హృదయమే బృందావనంగా తయారైంది. నిరంతరం దివ్యోన్మాద స్థితిలో జీవించేవాడు. శ్యామసుందరుని సంకల్పం తప్ప ఇంకొక సంకల్పం అతని మనస్సులో రావటంలేదు. భగవద్వియోగాన్ని భరించలేక సూరదాస్ తీవ్రంగా వ్యధ చెందేవాడు. శ్రీకృష్ణ దర్శన భాగ్యానికై అహోరాత్రులు తపించేవాడు "ప్రభూ నువ్వు తప్ప నాకు ఇంకెవ్వరు దిక్కు? నాకు దర్శనమియ్యి."అని విలపించేవాడు. "నా లోని

అవగుణాలను నువ్వు లెక్కపెట్టకు. నువ్వు కరుణా సముద్రుడవు కాదా!"

ప్రభు మేరే అవగుణ్ చిత్తనధరో!
సమదరశీ ప్రభు నామ్ తిహారో అపనే పనహి కరో॥
ఏక్ లీహా పూజామే రాఖత్, ఎక్ ఘర్ వధిక్ పరో।
యహ దువిధా పారస్ నహి జానత్ కంచన కరత ఖరో॥
ఏక్ నదియా ఏకీ నార్ కహావత మైలో నీర్ భరో।
జబ్ మిలికే దోవూ ఏక్ వరణ భయే సురసరి నామ్ పరై॥
ఏక్ జీవ్ ఏకబ్రహ్మ కహావత।
సూరశ్యామ్ జగరో। అబకే టేర్ మోహిపార్
ఉతారో నాహిపగ్ జాత్ టరో॥

"ప్రభూ నా అవగుణాలను తప్పుపట్టకు. నువ్వు సమదర్శివి అన్న ఘనబిరుదాంకితుడవు. నాకు నువ్వు శరణు ఇయ్యి. ఒకరు పూజ మీద మనస్సు పెడతారు. ఒకరు ఇంట్లో పెట్టుకొంటారు. కాని నువ్వు ఇద్దరినీ సమభావంతో నీ దగ్గరకు తీసుకుంటావు. నువ్వు పరుసవేది వంటి వాడవు. పరుసవేది ఇనుము ఏ ఆకారంలో ఉన్నా దానిని మేలిమి బంగారంగా మారుస్తుంది. ఒక నదిలో నిర్మలమైన నీరు ప్రవహిస్తుంది. చిన్న కాలవలో కలుషితమైన నీరు ప్రవహిస్తుంది. కాని ఈ రెండు కలసిన తరువాత దానికి సముద్రం అనే పేరు వస్తుంది. అలాగే ఒకడు జీవుడు. ఒకడు బ్రహ్మ అని అంటారు. రెండూ విడి విడి వస్తువులని వాదిస్తారు."

సూర్‌దాస్ అంటున్నాడు "ఓ శ్యామసుందరా! ఇంక నువ్వు నన్ను రక్షించే భారం నీదే!" అని.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL